

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 24.0

చదువుల సందడి

ఉద్యోగులు, గృహిణులు, కళాశాల రెగ్యులర్ తరగతులకు హాజరు కాలేని వారికి, గ్రామీణ ప్రాంతాల వారికి ఉన్నత విద్యా కోర్సులను చదవాలనే వాంఛను తీర్చేందుకు ఉద్దేశించిన డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపనకు బుధవారం కీలక అడుగు పడింది. నవ్యాంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేకంగా ఏలూరు సమీపంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ యూనివర్సిటీకి ఉప కులపతి (ఇన్‌చార్జి)గా ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ప్రస్తుతం ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్-1గా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జి వీసీ బాధ్యతలను గురువారం మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి ప్రధాన కార్యాలయంలో చేపడతారు.



ఏలూరులోని అంబేడ్కర్ స్టడీ సెంటర్


అంబేడ్కర్ వర్సిటీ తొలి వీసీ (ఇన్‌చార్జి)గా నియమితులైన ప్రొఫెసర్ విజయభాస్కరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉన్నత విద్యామండలి అధికారులు

ఏలూరు జిల్లాలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు!

- ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ విజయభాస్కరరావు నియామకం
- నేడు మంగళగిరిలో బాధ్యతల స్వీకరణ
- వారం రోజుల్లోగా యూనివర్సిటీ వెబ్‌సైట్, అడ్మిషన్ల నోటిఫికేషన్‌కు సన్నాహాలు
- కార్యకలాపాలు ఇక వేగవంతం

ఏలూరు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఉమ్మడి రాష్ట్ర ప్రయోజనాలు పొందేందుకు తుదిగడువు పదేళ్ల కాల పరిమితి 2024లో పూర్తి కాగా, అప్పటి వరకు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన అంబేడ్కర్ యూనివర్సిటీలో ఏపీ విద్యార్థులకు గతేడాది నుంచి అడ్మిషన్లు నిలిచిపోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరిన కొంత కాలానికి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైనప్పటికీ ఏలూరులో ఇంత వరకు విశ్వ విద్యాలయం లేని విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఆ లోటును అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుతో భర్తీ చేయనుంది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించి ప్రత్యేకంగా ఏపీ నుంచి విశ్వ విద్యాలయం ఆఫర్ చేసే 21 ప్రోగ్రాంలతో కూడిన డిగ్రీ, పీజీ కోర్సుల్లో సుమారు 40 వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటుంటారు. ఈ సంఖ్యలో ఏటా స్వల్ప మార్పులుంటాయి. కేవలం రూ.3,500 డిగ్రీ ఆర్ట్స్ ప్రోగ్రాం పూర్తి చేయడానికి ఏడాది ఫీజుగా వసూలు చేస్తుంటారు. ఈ క్రమంలో కేవలం డిగ్రీ అడ్మిషన్ల నుంచే యూనివర్సిటీకి ఏడాదికి రూ.12 కోట్లు ఫీజుల రూపేణా జమ అవుతుంటాయి. ఇక పీజీ ప్రోగ్రాంల అడ్మిషన్ల ఫీజులు అదనం.

ప్రస్తుతం రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి 72 రీజినల్ సెంటర్లు జిల్లా కేంద్రాల్లోను, ఎంపిక చేసిన పట్టణ ప్రాంతాల్లో స్టడీ సెంటర్లున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు, చింతలపూడి, భీమవరంలలో రీజినల్ స్టడీ సెంటర్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రెండేళ్లుగా (2024-25, 2025-26) యూనివర్సిటీ లేకపోవడంతో అడ్మిషన్లు నిలిచిపోయాయి.

వారం రోజుల్లో అడ్మిషన్ల నోటిఫికేషన్

- వీసీ నియామకంతో ఒక్కసారిగా జోష్ అందుకుంది. వర్సిటీకి ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించి అమల్లోకి తీసుకురావడం, 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ జారీని వారం రోజుల్లోగా పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రారంభిస్తున్నారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యే నెల నుంచి మరుసటేడాది అదే నెల వరకు లెక్కించి ఒక విద్యా సంవత్సరంగా పరి గణించేలా నోటిఫికేషన్ విడుదల చేయనున్నం దున ప్రస్తుత అకడమిక్ ఇయర్‌ను విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని వివరిం చాయి. విశ్వవిద్యాలయం ఇకమీదట అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీగా ఉంటుందన్నాయి.

ఏలూరులో వర్సిటీకి ప్రతిపాదనలు

యూనివర్సిటీకి కొన్ని నెలల క్రితమే ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ఆ మేరకు విశ్వ విద్యాలయ కార్యకలాపాలను ప్రస్తుతం విజయవాడలోని ఎస్ఆర్ కళాశాలలో ఓ భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తోంది. విశ్వ విద్యాలయ ప్రత్యేకాధికారి డాక్టర్ వెలగా జోషి, ఓ క్లర్క్ ప్రస్తుతం ఇక్కడి తాత్కాలిక భవనం నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఏలూరు జిల్లాకు మంజూరు చేసిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి భవనాల సేకరణకు ప్రస్తుతం అన్వేషణ జరుగుతోంది. తొలుత ప్రభుత్వానికి చెందిన భవనాల్లో యూనివర్సిటీ పరిపాలనా భవనం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి డిగ్రీ, పీజీ అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులకు తరగతుల నిర్వహణ కోసం అందుబాటులోవున్న భవనాలు ఎక్కడున్నాయనే దానిపై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి చెంతన హనుమాన్ జంక్షన్ -నూజివీడు మార్గంలో విశ్వ విద్యాలయం ఏర్పాటుకు తొలి ప్రాధాన్యతనిస్తున్నారు. ఏలూరు జిల్లాలోనే (మిగతా 8 లో)


పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ నాగరాణి

పారిశ్రామిక అభివృద్ధితో పాటు పర్యావరణమూ ముఖ్యమే : కలెక్టర్

భీమవరంటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమా లను ప్రోత్సహించే దిశగా ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా విస్తృత కార్యక్రమాలు ప్రారంభించినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలి పారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో వీటికి సంబంధించి పోస్టర్ విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ,శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఈనెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపీఐఐసీ విజయవాడ జోనల్ మేనేజర్, ఇండస్ట్రియల్ పార్క్ ఎంటర్‌ప్రైజర్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ జేఏసీ సమ్మె 17కు వాయిదా

తాడేపల్లిగూడెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ జేఏసీ ఇచ్చిన సమ్మె 17వ తేదీకి వాయిదా పడింది. 15వ తేదీ ఉదయం నుంచి విద్యుత్ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా సమ్మె జరగాల్సి ఉంది. మంగళవారం అర్ధరాత్రి జేఏసీ నాయకులతో ఉన్నతాధికారులు జరిపిన చర్చల్లో భాగంగా రెండు రోజులు పాటు గడువు ఇవ్వాలని సంస్థ ఉన్నతాధికారులు కోరారు. దీనికితోడు ఈనెల 16న ప్రధాన మంత్రి రాష్ట్రంలో పర్యటించనున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో జేఏసీ నాయకులకు సూచించారు. ఈలోగా కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామని సంస్థ ఉన్నతాధికారులు జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు. దీంతో 17వ తేదీ సాయంత్రం చర్చలు జరిపి తుది నిర్ణయం తీసుకుంటామని జేఏసీ నాయకులు తెలిపారు.



సమ్మోహనుడై..

- సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై విహరించిన శ్రీవారు
- ఘనంగా అష్టోత్తర శతకలశాభిషేకం
- వాడపల్లిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

చంద్రప్రభ వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతున్న వాడపల్లి వెంకన్న

పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతులు

గ్రేడ్-1 కార్యదర్శులు, గ్రేడ్-2 ఈవోలు, వీడీవో, సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల మధ్య గోడ తగాదా

9

యనమదుర్రుకు రూ.1.99 కోట్లు

స్లూయిస్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : యనమదుర్రు డ్రెయిన్‌పై స్లూయిస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తణుకు, పెంటపాడు మండలాల పరిధిలో ఏడు స్లూయిస్‌లు, ఒక అవుట్‌లెట్ నిర్మాణానికి రూ. 1.99 కోట్లు కేటాయించింది. పరిపాలనా అనుమతులు ఇచ్చింది. గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ తదుపరి చర్యలు చేపట్టాలని సూచించింది. వాస్తవానికి ఎనిమిది పనులకు రూ.1.96 కోట్లు వ్యయం కానుందని అంచనా వేశారు. ప్రస్తుత ధరలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకునేలా చీఫ్ ఇంజనీర్‌కు బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వం కేటాయించిన రూ.1.99 కోట్ల పరిధిలోనే పనులు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. కొన్నేళ్లుగా యనమదుర్రు డ్రెయిన్‌పై స్లూయిస్‌లు మరమ్మతులకు నోచుకోలేదు. వాటిని పునర్నిర్మించేందుకు నిధులు కేటాయించడంతో రైతులకు ఎంతో మేలు చేకూరనుంది.



మండలం	స్లూయిస్ నిర్మించే పరిధి	నిధులు (రూ.లక్షల్లో)
తణుకు	కోనాల(4.8 కి.మీ.వద్ద)	రూ. 24.22
తణుకు	కోనాల (5.3 కి.మీ)	రూ. 24.22
తణుకు	కోనాల (6.1 కి.మీ)	రూ. 24.22
తణుకు	ముద్దాపురం(6.9 కి.మీ)	రూ. 24.22
తణుకు	ముద్దాపురం(7.9 కి.మీ)	రూ. 24.22
తణుకు	ముద్దాపురం(8.3 కి.మీ)	రూ. 21.96
పెంటపాడు	బి.కొండేపాడు(11.2 కి.మీ)	రూ. 37.85
పెంటపాడు	బి.కొండేపాడు చానల్ అవుట్ లెట్	రూ. 15.15



స్కాన్ చేస్తే గుట్టు రట్టు !

- నకిలీ మద్యం గుర్తించేందుకు సురక్ష యాప్
- వైసీపీ హయాంలోనే చెన్నై నుంచి దిగుమతులు
- కూటమి అధికారంలోకి వచ్చాక తనిఖీలు ముమ్మరం
- భీమవరం, పాలకొల్లులలో అరెస్టులు

పాలకొల్లు నియోజకవర్గంలో కొద్ది నెలల క్రితం నకిలీ మద్యం నిల్వలను ఎక్సైజ్ శాఖ సీజ్ చేసింది. దాని మూలాలు కోనసీమ జిల్లాలో ఉన్నట్టు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే నర్సాపురంలో వైసీపీ నేత సాగు చేస్తున్న ఆక్వా చెరువుల్లో పెద్ద మొత్తంలోనే మద్యం బాటిళ్లను కనుగొన్నారు. సీజ్ చేశారు. ఆ నేతపై కేసు నమోదు చేశారు. పాలకొల్లులోనూ వైసీపీ నేతపై మద్యం కేసు నమోదైంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలోనే నకిలీ మద్యం దందాకు తెరలేచినట్టు అధికారులు గుర్తించారు. అప్పట్లో ప్రభుత్వ మద్యం షాపులు ఉండేవి. నాసిరకం మద్యాన్ని అమ్మకాలు సాగించేవారు. భీమవరంలోనూ జానీ వాకర్ బ్రాండెడ్ పేరుతో నకిలీ మద్యం తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. చెన్నయ్ నుంచి దిగుమతి చేసి గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్న ముఠాను ఎక్సైజ్ శాఖ కొద్ది నెలల కిందట అరెస్ట్ చేసింది. చెన్నయ్ నుంచి నకిలీ జానీ వాకర్ మద్యాన్ని తీసుకువచ్చి భీమవరంలో విక్రయించారు. ఎక్సైజ్ నకిలీ ముఠా గుట్టు రట్టుచేసింది. నకిలీ మద్యం, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ నిత్యం తనిఖీలు చేస్తూ వస్తోంది. ఇతర జిల్లాలో నకిలీ మద్యం గుట్టు రట్టు కావడంతో జిల్లాలోనూ తనిఖీలు ముమ్మరం చేశారు.

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్

నకిలీ మద్యాన్ని తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది.మద్యం షాపుల్లో విక్రయిస్తున్న బాటిళ్లను స్కాన్ చేస్తే కంపెనీ, కోడ్, బ్యాచ్ నెంబర్‌తో సహా విక్రయించే షాపు లైసెన్స్ నెంబర్ వివరాలు కూడా తెలిసిపోనున్నాయి. అదే నకిలీ మద్యం అయితే స్కాన్ కాదు. ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసిన బాటిళ్లు కూడా స్కాన్ అయ్యే అవకాశమే లేదు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ గతంలో (మిగతా 8 లో)

ఆంధ్రజ్యోతి
భీమవరం
భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, నరసాపురం
8 www.andhrajyothy.com ● గురువారం 16 అక్టోబరు 2025

17,18 తేదీల్లో భూములపై వార్డు సభలు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ భూములు, వ్యవసాయ భూములు ఏపీ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా రీసర్వే చేసినట్లు మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. రికార్డుల్లో తమ పేర్లు నమోదు అయ్యాయో, లేదో ఈ వార్డు సభల్లో యజమానులు పరిశీలన చేసుకోవచ్చన్నారు. దీనిలో భాగంగా ఈనెల 17, 18 తేదీల్లో భూయజమానులు తమ వార్డు సచివాలయం వద్ద నిర్వహించే వార్డు సభలకు వెళ్లి భూముల వివరాలు పరిశీలించుకోవాలని ఆయన కోరారు.

ప్రధాని సభకు నాలుగు బస్సులు

భీమవరం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రధాని విజయోత్సవ సభకు కర్నూలు బయలు దేరిన నాలుగు బస్సులకు జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం సాయంత్రం జెండాను ఊపి ప్రారంభించారు. గురువారం కర్నూలులో జరిగే సభకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్నారు. ఈ సభకు భీమవరం నుంచి వీఐపీలు, వ్యాపారవేత్తలు, ఎంఎంఎస్ఎంఈలు, టాక్స్ పేయర్స్ బయలు దేరి వెళ్లారు.భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు నుంచి 400 మంది హాజరవుతున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఇంద్రయ్య డిగ్రీ కాలేజిలో సదస్సు

తణుకు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజీలో ఈనెల 16,17 తేదీల్లో 'ఆక్వా ఎంటర్‌ప్రెన్యూర్ షిప్-వికసిత ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై సెమినార్ జరుగుతుందని ప్రిన్సిపాల్ సి.హెచ్. ఏడుకొండలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉప ఉలపతి ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ, ఏపీ ఉన్నత విద్యామండలి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని చెప్పారు.

గాంధీ విగ్రహానికి వినతి పత్రం


తణుకులో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

తణుకు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి):మునిసిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ బుధవారం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం మహాత్మాగాంధీ విగ్రహానికి సమర్పించారు. ఏఐటియూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, మునిసిపల్ వర్కర్స్ తణుకు శాఖ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ వచ్చే నెల 3నుంచి సమ్మెకు సమాయత్త వుతున్నట్లు చెప్పారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, 12వ పీఆర్సీ ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరిణించి, రిటైర్ అయిన వారి స్థానంలో కుటుంబ సభ్యులను కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భీమవరం టౌన్: మునిసిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. వచ్చేనెల 2 నుంచి మునిసిపల్ కార్మికులు చేపట్టనున్న సమ్మె సన్నాహాల్లో భాగంగా బుధవారం మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన నిర్వహించి, మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

వీజీఎస్‌లో స్టూడెంట్స్ ఎన్నికలు


స్టూడెంట్ కౌన్సిల్‌తో ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు

తణుకు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు బుధ వారం నిర్వహించారు. ఎన్నికలకు కెప్టెన్, వైస్ కెప్టెన్, డిప్యూటీ వైస్ కెప్టెన్, కార్యదర్శి పదవులకు పలువురు విద్యార్థులు పోటీలో నిలిచారు. సాధారణ ఎన్నికల మాదిరిగా బ్యాలెట్‌లు తయారు చేసి బాక్సుల్లో ఓట్లు వేయించారు. అనంతరం లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. విద్యార్థులు వచ్చిన ఓట్లు ఆధారంగా ఆయా పదవులకు నియమించారు. విజేతలకు స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మన చేతుల్లోనే ఆరోగ్యం ఉంటుందని ఎంపీడీవో వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. పెదతాడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే సందర్భంగా విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి టి రవిచంద్ర, రఘు, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్ పాల్గొన్నారు.

ఆకివీడు: మనం ఆహారం తినే ముందు చేతులు శుభ్రం చేసుకోకపోతే మలినాలు పొట్టలోకి వెళ్ళి అనారోగ్యాల బారిన పడతామని ఆరోగ్యశాఖ కమ్యూనిటీ హెల్త్ అధికారి రత్నకుమారి అన్నారు. బుధవారం స్థానిక జానకీనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు శుభ్రతపై ఆమె అవగాహన కల్పించారు. మరుగుదొడ్డికి వెళ్ళిన తరువాత, టిఫెన్, భోజనం చేసే ముందు, అంతే కాకుండా చేతులతో ఏ పనిచేసినా శుభ్రంగా కడుక్కోవాలన్నారు.

పెంటపాడు: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో వీవీవీఎస్‌ప్రసాద్ అన్నారు. బుధవారం పాఠశాలల వద్ద హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ టీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: కుప్పనపూడి ఎంపీయూపీ పాఠశాలలో గ్లోబల్ హ్యాండ్‌వాష్‌డే సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చేతులు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో బాబూరావు తెలిపారు. ఆహారం తీసుకునే సమయంలో చేతులు కడుక్కోవాలని సూచించారు.

చదువుల సందడి

(7వ పేజీ తరువాయి)

నూజివీడు ఉండటం కలిసొచ్చే అంశం. ఆ తర్వాత దెందులూరు నియోజకవర్గం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య శిక్షణ కళాశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన బాలుర వసతి గృహం భవనాన్ని పూర్తి చేసి అక్కడ యూనివర్సిటీ పరిపాలనా భవనాన్ని ముందుగా ప్రారంభించి, ఆ తదుపరి కళాశాల ప్రాంగణంలోనే విడిగా వున్న 6.50 ప్రభుత్వ పోరంబోకు భూముల్లో విశ్వ విద్యాలయానికి అవసరమైన అన్ని భవనాల నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన ఒకటి పరిశీలనలో ఉంది. ఈ క్రమంలో కళాశాలలో రూ.66 లక్షలు ఖర్చు చేసి, ఇప్పటికే 50 శాతానికిపైగా నిర్మాణాలు పూర్తయి అసంపూర్తిగా నిలిచిపోయిన బాలుర వసతి గృహాన్ని పూర్తి చేయడానికి మరో రూ.25 లక్షలు సీఎస్ఆర్ నిధులను మంజూరు చేయడానికి ఏలూరు ఎంపీ ఇటీవల హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామవిద్య శిక్షణ కళాశాల ప్రాంగణంలోనే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వద్ద పట్టుబట్టినట్టు సమాచారం. ఇక గతంలోనే విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో యూనివర్సిటీ భవన నిర్మాణం నిమిత్తం స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన 1.20 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్నికూడా అధికార వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏలూరుకు సమీపంలో ఏర్పాటుచేయతలపెట్టిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపన ఖరారు ఏ ప్రాంతంలో ఉంటుందోనన్న డైలమా కొంతకాలంగా కొనసాగుతూనే ఉంది. తాజాగా విశ్వ విద్యాలయానికి ఉపకులపతిని నియమించడంతో ఇప్పటి వరకు వున్న గందరగోళ పరిస్థితులకు తెరపడే అవకాశం ఉంది.

గుట్టు రట్టు

(7వ పేజీ తరువాయి)

అధికారులకు మాత్రమే అందుబాటులో ఉండేది. తనిఖీల సమయంలో షాపులకు వెళ్లి స్కాన్ చేసేవారు. అబ్కారీ నుంచి సరఫరా అయ్యిందా లేదా నకిలీదా..? పన్నేతర మద్యం అన్న విషయాన్ని నిర్ధారణకు రావడానికి యాప్‌ను వినియోగించేవారు. నకిలీలను అరికట్టే ఉద్దేశంతో ప్రభుత్వం ఇప్పుడు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందరికీ అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల మద్యం అమ్మకాలు పారదర్శకంగా ఉంటాయి. షాపుల్లోనూ స్కానింగ్ చేసి ఇవ్వాలని కోరితే తప్పనిసరిగా చేయాల్సిందే. లేదంటే మద్యం కొనుగోలు చేసే వినియోగదారులే తమ ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్కాన్ చేసుకోవచ్చు. మద్యం బాటిల్ పైకప్పుపై ఉండే స్టిక్కర్‌కు స్కాన్ చేస్తే సరిపోతుంది. అబ్కారీ నుంచి సరపరా అయితేనే స్కాన్ అయి వివరాలు వెల్లడి కానున్నాయి. తయారీ చేసిన డిపో, జిల్లా, షాపు వివరాలు కూడా తేటతెల్లం కానున్నాయి. నకిలీ మద్యాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

బీర్ బాటిళ్లకు సాధ్యపడదు

సురక్షా యాప్‌లో లిక్కర్, బ్రాందీ, వైన్, రమ్ వంటివి మాత్రమే స్కాన్ అవుతాయి. వాటిపైనే స్టిక్కర్‌లు అంటించారు. బీర్ బాటిళ్లకు మినహాయింపు ఇచ్చారు. బీర్‌ను నకిలీగా తయారు చేయడం సాధ్యపడదు. లిక్కర్, బ్రాందీల విషయంలోనే నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారు. గతంలో నాసిరకంగా మద్యం సరఫరా చేయడంతో ఏది నకిలీ ? ఏది అసలైనదో తెలిసేది కాదు. మార్కెట్‌లో నకిలీ మద్యం కూడా చలామణీ అయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. నాణ్యమైన బ్రాండ్లను సరఫరా చేస్తోంది. ధరలను తగ్గించింది. దాంతో నకిలీలలు బయట పడుతున్నాయి. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం వినియోగదారులందరికీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


తణుకులో కలాం విగ్రహం వివాళులు అర్పిస్తున్న దృశ్యం

తణుకు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): నేటి యువత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. బుధవారం అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా బాలురున్నత పాఠశాల 1978-19 పదవ తరగతి పూర్వ విద్యార్థులు నివాళుర్పించారు. కలామ్ సేవలను కొనియాడారు.

ఆకివీడు: శరీరంలో పళ్లు ఒక భాగమని, ఆ పళ్లతోనే మనం తినే తిండి శుభ్రంగా నమిలితే అసలు అనారోగ్య సమస్యలుండవని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, బీజేపీ మండలాధ్యక్షురాలు ముదునూరి నాగమణి అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోషియేషన్ హాల్లో ఆయన చిత్రపటాని కి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఉచిత దంత, రక్తదాన శిబిరాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గవర లక్ష్మి, రమణ, శ్రీను పాల్గొన్నారు.

మొగల్తూరు:కలాం జయంతి వేడుకలు బుధవారం ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల అవరణలో గల కలాం విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి శాస్త్ర విజ్ఞానంలో మార్గదర్శకుడుగా నిలిచారని కొనియాడారు.

తణుకు రూరల్:మిస్సైల్ మ్యాన్‌గా పేరొందిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేవీఎస్ వీవీ ప్రసాద్ కోరారు. బుధవారం భారతరత్న అబ్దుల్ కలాం 94వ జయంతిని పాఠశాలలో నిర్వహించారు. కలాం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెంకట్రాయపురం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.గోపాల కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలకొల్లు అర్బన్: స్థానిక ఎల్ఆర్‌పేట మాంటిస్సోరీ విద్యాసంస్థల్లో డైరెక్టర్ కెవి కృష్ణ వర్మ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి కృష్ణవర్మ ఫైర్ స్టేషన్ వద్దగల అబ్దుల్ కలాం పార్కులోని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ చిలుకూరి కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: దివంగత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జీవితం భావితరాలకు ఆదర్శమని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. దుంపగడప వివిగిరి ప్రభుత్వ కళశాలలో బుధవారం కలాం చిత్రపటం వద్ద నివాళలర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ యోగేశ్వరరావు, అడ్వకేట్ సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఆర్డీవో విచారణ


విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ఆకివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థుల ఆలనాపాలనా చూసుకోవాల్సిన వార్డెన్ దుర్భాషలాడడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించడం హేయమైనచర్య అని ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ శ్రీధర్‌పై ఫిర్యాదు, పూర్తిస్థాయిలో వార్డెన్ లేరంటూ మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో ఆయన పర్యటించి విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. శ్రీధర్ తమను చిత్రహింసలకు గురి చేయడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించేవాడని విద్యార్థులు తెలిపారు. నివేదిక కలెక్టర్‌కు అందజేస్తానని ఆర్డీవో తెలిపారు.

కల్తీ మద్యాన్ని అధికారులు నివారించాలి

ఆకివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కనుసన్నల్లో కల్తీ మద్యం విచ్చల విడిగా దొరుకుతుందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆరోపించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించి, అనంతరం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కరుణప్రియకు ఆయన వినతిపత్రం అందజేశారు. అధికారులు కల్తీ మద్యాన్ని నివారించాలన్నారు.

స్కేటింగ్‌లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

తణుకు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ హాకీక్వాడ్, కేడెట్ అండర్-12 సబ్ జూనియర్స్ అండర్-15 పోటీల్లో తణుకు మాంటిస్సోరి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో బుధవారం మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కాలేజి స్కేటింగ్ రింకులో ఆర్ఎస్ఎఫ్ఐ, ఏపీఆర్ఎస్ఏ నిర్వహించిన పోటీలలో ఏడుగురు కేడెట్ బాలురు, సబ్ జూనియర్ బాలురు ఎనిమిది ఎంపికైనట్లు చెప్పారు. సానబోయిన స్నేహశ్రీ ఓపెన్ కేటగిరిలో ఎంపికైందన్నారు. వచ్చేనెల 2 నుంచి 5 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని వివరించారు. ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ, అబ్జర్వర్ షేక్ ఖాసిం, కోచ్ అరెకపూడి భార్గవ్ అభినందించారు.

'ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేయొద్దు'

తణుకు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):పేద, మధ్యతరగతి విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తున్నదని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తణుకు పట్టణంలోని మూడో వార్డు, తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో నిర్వహించిన కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా నిర్వహించిన రచ్చ బండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయొద్దని కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు.

రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు

ఆకివీడు రూరల్ అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కళింగపాలెం- చినిమిల్లిపాడు రహదారి నిర్మాణానికి రూ.80లక్షలు నిధులు మంజూరు అయ్యాయని కళింగపాలెం, చినిమిల్లిపాడు గ్రామస్థులు తెలిపారు. విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న రహదారి నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు నిధులు మంజూరు చేశారని తెలిపారు. దీంతో యేళ్ళ తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభించినట్లు అయ్యిందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

ఆలయంలో పనులపై కలెక్టర్ అసంతృప్తి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పనులపై అసంతృప్తి వ్యక్తమవుతున్నది. నిర్వహణా లోపాలు, అర్చనలు, తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి. ఈ మేరకు మంగళ వారం ఆలయంలో జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న కొన్ని సంఘటనలపై నేరుగా తనకు ఫిర్యాదులు వచ్చాయని, ఆలయంలో సిబ్బందిపైనా, అర్చకులు, పండితులపైనా సానుకూలంగా నివేదికలు రాలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటువంటి లోటుపాట్లను పునరావృతం కాకుండా చూసు కోవాలని, తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. అధికారులు, సిబ్బందిలో మార్పులు లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

బాలికలు లక్ష్యసాధనకు కృషి చేయాలి

భీమవరం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా భీమవరం తిరుమల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చదువుకునే దశలో బాలికలు పౌష్టికాహారం తీసుకుని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. బాలికల ఉత్తీర్ణత శాతం బాలురకంటే ముందుందన్నారు. మహిళలు ఉద్యోగాల్లో స్థిరపడి తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. కాళ్ళ మండలంలోని మాలవానితిప్ప జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని పి.రమాదేవి బాలికలపై వివక్షత, రక్షణ, చూపించాల్సిన చొరవ తదితర అంశాలపై అనర్గళంగా మాట్లాడటం అబ్బురపరిచింది.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

భీమవరం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు 20 మంది లబ్ధిదారులకు రూ.21,31,462లు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. ఇప్పటికి వరకు భీమవరం నియోజకవర్గంలో 321 మందికి రూ.2,90,48,358 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించామన్నారు.

కార్మిక హక్కుల్ని కాలరాయడం సరికాదు

నరసాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కుల్ని కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షులు ఎం.త్రిమూర్తులు, టి.సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం మీరాగ్రంథాలయ భవనంలో మహాసభ నిర్వహించారు. కార్మికవర్గం పోరాడి తెచ్చుకున్న 8గంటల పనిదినాలకు తూట్లు పొడవడం సరికాదన్నారు. ఈకారణంగా కార్మికులు, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కన్వీనర్‌గా కోడి లక్ష్మణ్, కో-కన్వీనర్‌గా బేగం, కొండలతో పాటు మరో 18 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు.

పుంతల ముసలమ్మకు ప్రభోత్సవం


పూజలు చేస్తున్న కొవ్వలి నాయుడు

నరసాపురం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డులో పుంతల ముసలమ్మ ప్రభోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళాతాళాలు, బాణసంచా కాల్చుతూ పట్టణ పురవీధుల గుండా అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరావు, సంకు భాస్కర్, మల్లాడి మూర్తి, కోటిపల్లి రాంబాబు, బుజ్జీ, త్రిమూర్తులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యులకు మద్దతుగా నిరసన


ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది

కాళ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన సమ్మెకు వైద్య సిబ్బంది మద్దతు తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించుకుని ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవో నెంబర్ 99ని వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతోనే విధులు నిర్వహించారు.

వాహనాల రాకపోకలకు లైన్ క్లియర్


ఆర్వోబీ వద్ద వాహనాల రాకపోకలకు రైల్వేగేటును తెరిచిన దృశ్యం

ఉండి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):ఉండి ఆర్వోబి వద్ద వాహనాల రాకపోకలకు లైన్‌క్లియర్ అయ్యింది. దాంతో వాహనచోదకులు, ప్రయాణికులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి ఆర్వోబి వద్ద ఆయా పనులలో భాగంగా రైల్వేగేటును మూసివేస్తున్న ట్లు ప్రకటించారు. దాంతో ఉండి నుంచి ఆకివీడు వెళ్లేవారు పాముల పర్రు మీదుగా, అలాగే ఆకివీడు నుంచి ఉండి భీమవరం రావాలంటే పెదపుల్లేరు సీసలి మీదుగా భీమవరం మార్గాన్ని ఏర్పాటు చేశారు. దాంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం ఆర్వోబీ వద్ద పనులు పూర్తికావడంతో రైల్వేగేటును తెరవడంతో వాహనాలు రాకపోకలు కొనసాగాయి.

రైతుల అనుభవాలు విద్యార్థులకు తెలపాలి

పెనుమంట్ర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ రంగంలో గొప్ప సృష్టికర్తలని, వారి వ్యవసాయ అనుభవాన్ని పంచినప్పుడే విద్యార్థులకు వ్యవసాయం మీద అవగాహన ఏర్పడుతుందని వ్యవసాయ కళాశాల (రాజమహేంద్రవరం) ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మల్లిపూడి గ్రామంలో గ్రామీణ రావ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు 4వ సంవత్సరం విద్యార్థులు సామాజిక పటంతో పాటు వివిధ పటాలను తయారు చేశారు.

మద్యం బాటిళ్లను యాప్‌లో స్కాన్ చేయాలి

భీమవరం క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ స్టేషన్‌లో బుధవారం సీఐ బలరామరాజు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం దుకాణాలు, బార్లలో పని చేసే గుమస్తాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇటీవల ప్రభుత్వం నాణ్యమైన మద్యం ప్రజలకు అందించడంపై అవగాహన కల్పించడానికి తీసుకువచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ వాడకంపై అవగాహన కల్పించారు. ఇకపై దుకాణాల్లో మద్యం బాటిళ్ళను యాప్‌లో స్కాన్ చేసి మాత్రమే విక్రయించాలని అన్నారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మాలని అన్నారు. సమావేశంలో ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసం కష్టపడతాం

పెనుగొండ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కష్టపడతామని త్రిసభ్య కమిటీ చైర్మన్ నక్కా వేద వ్యాస శాస్త్రి అన్నారు. బుధవారం పెనుగొండ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ సొసైటీలో ఇన్సూరెన్స్ చేయడం ద్వారా కూడా రైతులకు మరింత మేలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మాణాలు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వేండ్ర మురళి, కానూరి వెంకట సత్యనారాయణ, సీఈవో సూర్నీడి శ్రీరంగా సాయి, పవన్ కుమార్‌లు పాల్గొన్నారు.

విశాఖలో గూగుల్ సెంటర్‌తో రాష్ట్రానికి మహర్దశ

మొగల్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను విశాఖ నగరంలో ఏర్పాటు చేయనుండటంతో రాష్ట్రానికి మహర్దశ పట్టనుందని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పేరుపాలెం సౌత్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూగుల్ సంస్థ రూ.87,500 కోట్లు పెట్టుబడితో విశాఖలో అతిపెద్ద గూగుల్ అనుబంధ సంస్థ రైడార్ డేటా సెంటర్‌ను ప్రారంభించనుందన్నారు. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) రోజు,రోజుకు విస్తరిస్తుండటంతో భారీ కంప్యూటర్ సామర్థ్యం అవసరమవుతుందన్నారు. అనేక టెక్ కంపెనీలు తమ డేటా సెంటర్‌లను విశాఖలో ఏర్పాటు చేయడంద్వారా లక్షలాదిమందికి ఉద్యోగాలు రానున్నాయన్నారు. సమావేశంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, నాయకులు సత్తినేని త్రిమూర్తులు, జోగి పండు, కవురు ముత్యాలరావు, సత్తినేని సర్వేశ్వరరావు, బాబ్జి, చల్లా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భీమవరం టౌన్: గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చారిత్రాత్మకమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. రాష్ట్రంలో నవశకం మొదలైందని ఏపీలో ఏఐడేటా సెంటర్ రావడం నిరుద్యోగ యువతకు అదృష్టమని అన్నారు. ఐదేళ్లలో 2 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

లాగని కాలనీ ముంపునీరు


ముంపులోనే ఆదిలక్ష్మీ అమ్మవారి కాలనీ సముదాయం

మొగల్తూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు స్థానిక ఆదిలక్ష్మి అమ్మవారి కాలనీలో ముంపు నీటిబెడద తగ్గడం లేదు. ఈ కాలనీకి డ్రెయినేజీ సదుపాయం లేకపోవడం, కాలనీలో అంతర్గత రహదారులు నిర్మాణం పూర్తికాకపోవడంతో వర్షం కురిస్తే నీరులాగే పరిస్థితి లేదు. దీంతో వర్షం కురిస్తే కాలనీలో నీరు నిలిచిపోయి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా ఆదిలక్ష్మీ అమ్మవారి కాలనీకి సంబంధించి ముంపునీరు కోనాయికోడు డ్రెయిన్‌లోకి మళ్ళించాల్సి ఉందని అయితే ఆ కాలనికి చెందిన ఇరువురు తమ ప్రహరీ గోడ కూలే అవకాశం ఉందని కచ్చా డ్రెయిన్ తవ్వద్దంటూ అడ్డకోవడంతో సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్ళామని తెలిపారు.

దండగర్ర రేషన్ డీలర్‌పై విచారణ


విచారణ చేస్తున్న డీటి అన్నపూర్ణ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మండలం దండగర్ర రేషన్ డీలర్ చిక్కాల అంబేద్కర్‌పై సివిల్ సప్లయిస్ డీటీ అన్నపూర్ణ బుధవారం విచారణ నిర్వహించారు. రేషన్ షాపు సమయానికి తీయకపోవడం, కార్డుదారులపై అనుచితంగా ప్రవర్తించడంతో పాటు రేషన్ సరఫరాలో అవకతవకలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. డీటీ అన్నపూర్ణ విచారణ చేసేందుకు వచ్చిన సమయంలో రేషన్‌కు సంబంధించిన ధరలు, స్టాక్ వివరాలు నమోదు చేయకపోవడాన్ని డీటీ గుర్తించారు. కార్డుదారుల ఫిర్యాదు మేరకు డీలర్‌పై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. విచారణలో సర్పంచ్ పిల్లా అన్నవరం, నాయకులు, పాల్గొన్నారు.

కొల్లి రాజశేఖర్‌కు సత్కారం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ ఎస్టీ జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటి సభ్యునిగా నియమితులైన బీజేపీ తాడేపల్లిగూడెం మండల ప్రధాన కార్యదర్శి కొల్లి రాజశేఖర్‌ను తణుకు ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ సత్కరించారు. మెట్టఉప్పరగూడెంలోని రాజశేఖర్ నివాసం వద్ద బుధవారం పూలదండలు, శాలువాతో సత్కరించారు. యూటీఎఫ్ కార్యదర్శి కొడమంచిలి కిరణ్ కుమార్, యార్లగడ్డ దాసు, చాట్ల రమేష్, నూతంగి శ్రీను పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు పేద ప్రజలకు మేలు

భీమవరం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నాలుగు స్లాబులు ఉన్న జీఎస్టీని రెండు స్లాబులుగా పన్నులను తగ్గించి గత నెల 22వ తేదీ నుంచి అమలు చేస్తున్నారని రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామ లక్ష్మి అన్నారు. డిమార్ట్ వద్ద జీఎస్టీపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ పన్నులను 18 నుంచి 5 శాతానికి తగ్గించడంతో నిత్యావసరాలు, కాస్మోటిక్స్, గృహ ఉపయోగ వస్తువులు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల రేట్లు తగ్గాయన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మద్దుల రాము, చల్లబోయిన గోవింద్, గంటా త్రిమూర్తులు, ఎండి షబీనా తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడు కృష్ణంరాజుకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న కృష్ణంరాజును సత్కరించిన దృశ్యం

భీమవరం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు 30 ఏళ్లగా అంకితమైన చిలుకూరి కృష్ణంరాజు డాక్టరేట్ అందుకోవడం హర్షించదగ్గ విష యమని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, సీనియర్ నాయకులు కంతేటి వెంకటరాజు అన్నారు. ఢిల్లీలో ఇండియా హ్యాబిటెట్ సెంటర్లో జరిగిన వేడుకల్లో అమెరికాలోని బర్లింగ్టన్ స్టేట్ యూనివర్శిటీకి చెందిన ప్రతినిధులు ఇటీవల కృష్ణంరాజుకు డాక్టరేట్ అందించారు. ఈ సందర్భంగా భీమవరం జేపీ రోడ్డులోని లయన్స్ ఇంటర్నేషనల్ చైర్‌పర్సన్, మాజీ జిల్లా గవర్నర్ చిలుకూరి కృష్ణంరాజును లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు.

బాక్సింగ్‌లో దేవాకు కాంస్య పతకం


కాంస్య పతకం సాధించిన విద్యార్థి దేవాతో హెచ్ఎం, పీడీ

తణుకు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు రాజమండ్రిలో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్ 17 బాక్సింగ్ పోటీలలో మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.దేవా కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం కె.ఫణిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి దేవా, శిక్షణ ఇచ్చిన పీడీ ఎస్.సూర్యనారాయణను గ్రామ సర్పంచ్ జాన వెంకట లక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ గూడూరి మహాలక్ష్మి అభినందించారు.

వసుధా ఫౌండేషన్ ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వసుధా ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ముగ్గురు పేద రోగులకు ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించినట్టు కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు తెలిపారు. హోమియోపతి వైద్యులు కోసూరి ఆనంద కృష్ణంరాజు చేతుల మీదుగా అందజేసినట్టు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామ రాజుకు రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

కొండగూడెంలో చోరీ

ఉండి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):ఇంట్లో ఎవరు లేని సమయంలో లోపలకు వెళ్లి బంగారు వస్తువులను అపహరించారు. ఉండి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పాములపర్రు పంచాయితీ కొండగూడెంనకు చెందిన బోణం రామలక్ష్మి తన ఇంటిలోని బీరువాలో ఉన్న బంగారు నగలు కనిపించడంలేదని బుధవారం ఉండి పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు.



ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ, మహా స్నపనం

సమ్మోహన రూపుడై..

- సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై విహరించిన శ్రీవారు
- వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం
- వాడపల్లిలో ఆరో రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన బుధవారం వేకువజామున సుప్రభాత సేవ, నవనీత హారతిలతో స్వామివారిని మేల్కొల్పారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శత కలశాభిషేకం, హోమాలను నిర్వహించారు. ఉదయం 10.34 గంటలకు శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమం, శ్రీలక్ష్మీవేంకటేశ్వర మూలమంత్రపూర్వక వేంకటేశ్వరస్వామి హోమాలను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 7.10 గంటలకు మోహిని అలంకరణలో శ్రీవారు చంద్రప్రభ వాహనంపై అధిష్ఠించి తిరువీధుల్లో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని కనులారా చూసి తన్మయత్వం పొందారు.



సినిమా చిత్రీకరణకు క్లాప్ కొడుతున్న అంబికా కృష్ణ

అంబికా ఆలయంలో సినిమా చిత్రీకరణ

ఏలూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నూతన నటీనటులు జాలా అరవింద్, పవిత్ర నటిస్తున్న సినిమా చిత్రీకరణ అంబికా ఆలయంలో పూజా కార్యక్రమాలతో బుధవారం ప్రారంభమైంది. మెగా మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.1గా శ్యామ్ వట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి సినీ నిర్మాత, అంబికా గ్రూప్ సంస్థల అధినేత అంబికా కృష్ణ క్లాప్ కొట్టి ప్రారంభించారు. వెంకట్ జుత్తిగ దర్శకత్వం వహించారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ కంటెంట్ ఉంటే చిన్న చిత్రమైనా ఘన విజయం సాధిస్తుందన్నారు. ఇటీవల విడుదలైన చిన్న చిత్రాలు పెద్ద చిత్రాలకంటే ఘన విజయం సాధిస్తున్నాయన్నారు. నిర్మాత చిత్రానికి ఆయువు పట్టు లాంటివారన్నారు. డైరెక్టర్ వెంకట్ మాట్లాడుతూ పాత కొత్త తారాగణంతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామన్నారు. సీనియర్ నటులు ఆమని, శుభలేఖ సుధాకర్, గౌతమ్ రాజుతో పాటు మరో 25 మంది నటిస్తున్నారన్నారు. మార్చిలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోనిరెడ్డి శ్రీనివాస్, వేగి వెంకట్రావు, కె మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా జట్లతో వ్యాయామోపాధ్యాయులు

హ్యాండ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు పెదవేగిలోని బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బుధవారం జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన 19ఏళ్ల విభాగం పోటీల్లో బాలురు, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశామని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 400 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారని, వారిలో బాలికల జట్టుకు 16 మంది, బాలుర జట్టుకు 16 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని జయరాజు చెప్పారు. ఎంపిక చేసిన జిల్లా జట్లు త్వరలో జరిగే జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ ఎంపిక పోటీల్లో గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎవి.శివప్రసాద్, పీడీలు అండాలు, సుబ్బారావు, ఇతర వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ఎన్టీఆర్ వైద్య భరోసా సేవలు పునరుద్ధరించాలి

ఆకివీడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య భరోసా సేవలు పునరుద్ధరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. వైద్య సేవలు నిలుపుదలతో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రంప్ విధించిన సుంకాల ప్రభావంతో జిల్లాలో ఆక్వా, వ్యవసాయ రైతులు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా, వ్యవసాయ రంగాలను ఆదుకోవాలన్నారు. జీఎస్టీతో ఇప్పటికే రూ.60లక్షల కోట్లు ముక్కుపిండి వసూలు చేసి ఇప్పుడు తగ్గించామని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పిల్లలు వాడే స్టేషనరీ, పెన్సిల్, పెన్నులపై కూడా పన్ను వసూలు చేశారన్నారు. యువతకు ఉపాధి లేకపోవడం వలన నిరుద్యోగం పెరిగిందన్నారు. మహిళలకు 18 ఏళ్లు నిండిన వారికి రూ.1,500 ఎప్పుడు ఇస్తారన్నారు. అభివృద్ధి పేరుతో యుద్ధప్రాతిపదికన పేదల ఇళ్లు కూల్చివేయించిన ఎమ్మెల్యే వారికి ప్రత్యామ్నాయం చూపకపోవడంతో వందలాది మంది పేదలు నిరాశ్రులయ్యారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, జక్కంశెట్టి సత్యనారాయణ, దూసి కళ్యాణి, ఎ.అజయకుమారి, కె.తవిటినాయుడు తదితరులు ఉన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులకు

పదోన్నతులు



పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులపై అంగీకార పత్రాలను స్వీకరిస్తున్న పశ్చిమ, ఏలూరు జిల్లాల డీపీవోలు

- గ్రేడ్-1 కార్యదర్శులు, గ్రేడ్-2 ఈవోలు, వీడీవో, సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి
- డిప్యూటీ ఎంపీడీవోలుగా అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఉద్యోగుల నుంచి పదోన్నతికి అంగీకార పత్రాల స్వీకరణ
- జడ్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్

ఏలూరు సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతి లభించనుంది. తొలుత గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-2 ఈవోలు, వీడీవోలు, సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించనున్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉద్యోగుల నుంచి అంగీకార పత్రాల స్వీకరణ చేపట్టారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా డీపీవోలు కొడాలి అనూరాధ, రామిరెడ్డి అంగీకార పత్రాలు స్వీకరించారు. గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-2 ఈవోలు, గ్రేడ్ -1 పంచాయతీలలో వీడీవోలతో పాటు డీపీవో, డీఎల్‌పీవో కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ల నుంచి పదోన్నతులకు అంగీకార పత్రాలను తీసుకున్నారు.

పంచాయతీ రాజ్ సంస్కరణలలో భాగంగా అధిక జనాభా కలిగిన అర్బన్ పంచాయతీలకు వారిని డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రామ సచివాలయాల్లో మండల స్థాయి అధికారులుగా నియమించనున్నారు. పంచాయతీరాజ్ సంస్కరణలలో భాగంగా ఇప్పటి వరకు 5 గ్రేడ్‌ల విధానాన్ని 4 గ్రేడ్‌లకు మార్పు చేశారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు (అర్బన్ పంచాయతీలు), గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్ 3 పంచాయతీలుగా విభజించారు. ఆయా పంచాయతీలలో కార్యదర్శులకు బదులు డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమితులవుతారు. ఈవోపీఆర్‌డీ వ్యవస్థ కనుమరుగు కానుంది. ఈవోపీఆర్‌డీ కేడర్‌నే డిప్యూటీ ఎంపీడీవోలుగా మార్పు చేస్తున్నారు. తొలి విడతగా పంచాయతీ ఉద్యోగులకు పదోన్నతుల కార్యక్రమం ప్రారంభించారు. తర్వాత మిగిలిన విభాగాల్లో చేపట్టనున్నారు. పంచాయతీ రాజ్‌లో సంస్కరణలతో పంచాయతీలు బలోపేతం అవుతాయని భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందే ఈ ప్రక్రియ ప్రారంభం కావడంలో ఎన్నికల పూర్తయ్యే సమయానికి పంచాయతీలను బలోపేతం చేయడం, గ్రామ పంచాయతీల్లో సౌకర్యాలను కల్పించడం ప్రభుత్వ లక్ష్యంగా చెబుతున్నారు.

కౌన్సెలింగ్‌కు 179 మంది

పదోన్నతుల కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 179 మంది హాజరయ్యారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 143 మంది, గ్రేడ్ -2 ఈవోలు 20మంది, గ్రేడ్-1 పంచాయతీల్లో వీడీవోలు 13 మంది, డీపీవో, డీఎల్‌పీవో కార్యాలయాల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురు హాజరయ్యారు. బుధవారం జరిగిన అంగీకార పత్రాల స్వీకరణకు సంబంధించిన నివేదికను పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు పంపిస్తారు. రెండు జిల్లాల డీపీవోలతో పాటు ఏలూరు డీఎల్‌పీవో అమ్మాజీ, కార్యాలయ ఏఓ ఎంవి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాలకు నమ్మకం కలిగించాలి

- కేరళ డీజీపీ ఆజాద్ చంద్రశేఖర్



చంద్రశేఖర్ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు

వీరవాసరం (భీమవరం టౌన్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితాలకు నమ్మకం కలిగించడం పోలీసుల బాధ్యత అని కేరళ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం గ్రామంలో జన్మించి, స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి అత్యున్నత పదవిలో పనిచేస్తున్న రావాడ ఆజాద్ చంద్ర శేఖర్‌కు వీరవాసరం గ్రామ ప్రజలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, కేరళ రాష్ట్రం డీజీపీగా ఎదగడానికి ప్రధాన కారణం గురువులు, ఊరి ప్రజల ఆశీస్సులే కారణం అన్నారు. తాను సాధారణ విద్యార్థినని, ఐపీఎస్ సాధించడంలో యోగ్యత, యోగం కూడా కలిసి ఉన్నాయన్నారు. యోగ్యత ఉంటే యోగం భగవంతుడు చూపిస్తాడని వ్యాఖ్యానించారు. పొలం పనులు కూడా చేశానని, విద్యార్థులు గురువుల ఉపదేశాలు, మార్గదర్శకంలో ఎంతో సాధించగలరన్నారు. ఇంటర్నెట్‌కు పిల్లలు బానిసలు కాకూడదని, సరైన మార్గంలో వాడుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కేరళ డీజీపీగా చంద్రశేఖర్ పశ్చిమగోదావరి జిల్లావాసి కావడం ఎంతో గర్వించదగిన విషయం అన్నారు. ఎమ్మెల్యే పునపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని వ్యక్తి ఒక రాష్ట్రానికి డీజీపీ కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం రావాడ చంద్రశేఖర్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్జి వీరవల్లి గోపాలకృష్ణ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డిప్యూటీ కలెక్టర్ పద్మ, సర్పంచ్ చికిలే మంగతాయరు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ X రెవెన్యూ

మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల మధ్య గోడ తగాదా

ప్రహరీ కూల్చివేశారంటూ రెవెన్యూ శాఖపై మండల పరిషత్ ఆరోపణ



పడిపోయిన ప్రహరీ

పెంటపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ నిర్మాణంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు గొడవ పడుతున్నాయి. పెంటపాడు మండలంలో మండల పరిషత్, తహసీల్దార్, మహిళా సమాఖ్య, ఎంఈవో, సర్వేయర్, హౌసింగ్, వ్యవసాయ శాఖ తదితర కార్యాలయలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గోడ కొంచెం మలుపు తిరిగింది. అక్కడ గోడను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది కూల్చి వేశారని, ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన గోడను బాధ్యత కల్గిన అధికారులు ఎలా కూల్చి వేస్తారని మండల పరిషత్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలం అక్కడి వరుకూ మాత్రమే ఉందని, దీనితో తాము గోడను ఆవిధంగా నిర్మించామని చెబుతున్నారు.

దీనిపై తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మరో విధంగా చెబుతున్నారు. తొలుత తమకు గోడను ఇలా నిర్మాణం చేస్తామని చెప్పలేదని, గోడవరుకూ కట్టి ఫెన్సింగ్ వేస్తామన్నారన్నారు. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా గోడ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. తాము గోడను పడగొట్టలేదని ఉదయం నిర్మాణం చేయడంతో స్థలం చూసే ప్రయత్నంలో అనుకోకుండా గోడ పడిపోయిందని చెబుతున్నారు. అయితే రెవెన్యూ వర్గాల వాదనను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఒప్పుకోవడం లేదు. కొన్ని రోజుల క్రితం గోడ నిర్మాణం జరిగిందని, బుధవారం కేవలం ప్లాస్టింగ్ మాత్రమే చేయడం జరిగిందంటున్నారు

గోడ కూల్చడం సరికాదు

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సి వారు ఇలా గోడను కూల్చడం సరికాదు సమస్య ఉంటే నేరుగా వచ్చి మాతో మాట్లాడాలి. ఇలా కూలగొట్టడం సమంజసం కాదు. కనీసం మాతో సంప్రదించలేదు ఇలా జరిగినందుకు చాలా బాధగా ఉంది. జరిగిన సంఘటన స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- పీవీవీఎస్ రాంప్రసాద్, ఎంపీడీవో

మాకు చెప్పకుండా నిర్మించారు

గోడ నిర్మాణంపై ముందు మాకు ఒక విధంగా చెప్పారు. తరువాత ప్లాన్ మార్చి వేరేవిధంగా నిర్మించారు. కనీసం మాతో సంప్రదించలేదు. ఇలా చేయడం సరికాదు. మా వాళ్లు గోడ పడగొట్టలేదు. అప్పుడే కట్టిన గోడ కారణంగా స్థలం చూసేప్పుడు అది పడిపోయింది. దీనిపై గురువారం సర్వేయర్‌ని పిలిపించి సర్వే చేయిస్తాం.

- రాజరాజేశ్వరి, తహసీల్దార్

17, 18 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఈనెల 17, 18 తేదీలలో చర్లపల్లి, అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. రైల్ నెంబర్ 07097 చర్లపల్లి నుంచి అనకాపల్లికి ఈనెల 17న రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. 07098 అనకాపల్లి నుంచి 18న సాయంత్రం 5.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లల్లో ఫస్ట్‌క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.



వంగ తోటను ఆశించిన పురుగులు

తీరంలో వంగ తోటలు పరిశీలించిన అధికారులు

మొగల్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తీర గ్రామాల్లో వంగ తోటల్లో తెగుళ్లపై ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఉద్యాన శాఖ అధికారులు స్పందించారు. పలు గ్రామాల్లోని వంగ తోటలు పరిశీలించి ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కల వారితోట, నల్లంవారితోట, పోతులవారి మెరకలో సాగు చేసిన వంగ తోటలను జిల్లా ఉద్యానవన అధికారి ప్రియదర్శిని ఆదేశాలతో ఏవో నిహారిక వంగ మొక్కలు, పురుగులు పరిశీలించి నమూనాలను సేకరించారు. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని జిల్లా అధికారి ఆధ్వర్యంలో సస్యరక్షణకు చర్యలను చేపడతామని రైతులకు భరోసా ఇచ్చారు.

జిల్లా కోర్టు ఆవరణలో క్యాంటీన్ ప్రారంభం

ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు



క్యాంటీన్ ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా జడ్జి

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో కక్షిదారుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నూతనంగా నిర్మించిన క్యాంటీన్ బిల్డింగ్ సముదాయాన్ని హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.సురేష్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి మాట్లాడుతూ 2018 నుంచి ఏలూరు కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు కృషి జరిగిందన్నారు. హైకోర్టు అనుమతితో క్యాంటిన్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో 14 కోర్టులు ఉన్నాయని ఈ కోర్టులలో వివిధ కేసుల నిమిత్తం వందలాది మంది కక్షిదారులు, న్యాయవాదులు సాధారణ ప్రజలు వస్తూ ఉంటారని వివరించారు. వారికి అసౌకర్యం కలగకుండా ఆహారాన్ని అందించే నిమిత్తం క్యాంటీన్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామ్ మర్యాదపూర్వకంగా ఘనంగా సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ నోముల రాయుడు, జాయింట్ సెక్రటరీ ఇబ్రహీం షరీఫ్, కోశాధికారి గండికోట సీతారామరాజు, గద్దె విజయ భాస్కర్, పొట్ట దుర్గ భవాని, లైబ్రరీ సెక్రటరీ కిశోర్, జిల్లా పీపీ ఏవి నారాయణ పాల్గొన్నారు. బిల్డింగ్ కమిటీ చైర్మన్ విజయకుమార్‌ను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. పలువురు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.

యర్రాయిచెర్వు సర్పంచ్‌పై కేసు

ఇరగవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యర్రాయిచెర్వు సర్పంచ్ మహిళపై దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తణుకు మండలం కొమరవరం గ్రామానికి చెందిన ఆకుల ఉమా మహేశ్వరి స్థలం కొనుగోలు నిమిత్తం రూ.2 లక్షల సొమ్మును యర్రాయిచెర్వు గ్రామానికి చెందిన జుత్తిగ శ్రీనివాస్‌కు ఇచ్చింది. తర్వాత భర్తతో మాట్లాడి స్థలం కొనుగోలు చేయడం లేదని డబ్బులు తిరిగి ఇవ్వాలని శ్రీనివాస్‌ను కోరింది. అతడు సమాధానం చెప్పకపోవడంతో ఉమామహేశ్వరి పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల వద్ద డబ్బు ఇస్తానని చెప్పి రూ. లక్ష ఇచ్చాడు. మిగతా లక్ష ఇచ్చేందుకు యర్రాయిచెర్వు సర్పంచ్ జుత్తిగ వెంకట మహేష్‌రావు హామీపై ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత శ్రీనివాస్‌కు ఉమామహేశ్వరిదేవి ఫోన్ చేయడంతో దుర్భాషలాడాడు. దీనితో ఆమె సర్పంచ్ జుత్తిగ వెంకట మహేష్‌రావుకు విషయం చెప్పడానికి వెళ్లింది. సర్పంచ్ మహేష్ కూడా తనపై దాడికి పాల్పడ్డాడు. ఆమె ఫిర్యాదు మేరకు సర్పంచ్ వెంకట మహేష్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇరగవరం హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. మరోవైపు జుత్తిగ వెంకట మహేష్‌రావు భార్య కృష్ణకుమారి ఉమామహేశ్వరిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉమామహేశ్వరి డబ్బులు ఇప్పించండి అంటూ తన భర్త జుత్తిగ వెంకట మహేష్‌రావును దుర్భాషలాడిందని, డబ్బు ఇప్పించకపోతే అంతు చూస్తానంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇరువురి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడి మృతి

పాలకొల్లు టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నరసాపురం రోడ్డులో ప్రభుత్వాసుపత్రి సమీపంలో బుధవారం జరిగిన ప్రమాదంలో పురోహితుడు మరణించారు. పోడూరు మండలం జిన్నూరుకు చెందిన శివకోటి అప్పారావు (60) మోపెడ్‌పై దిగమర్రు వైపు నుంచి పాలకొల్లు వస్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పట్టణ సీఐ కె.రజనీకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ రజనీ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూటర్‌పై వెళుతున్న వ్యక్తి ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విజయవాడకు చెందిన హెచ్.రాజేష్ (57) హార్డ్‌వేర్ బిజినెస్ చేస్తున్నాడు. స్కూటర్‌పై బుధవారం రాజమండ్రి వెళ్తుండగా ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ రైల్వే బ్రిడ్జి వద్ద ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోయారా లేదా మరేదైనా వాహనం ఢీకొందా అనే వివరాలు తెలియరాలేదు. తీవ్ర గాయాలకు గురైన రాజేష్‌ను సమీపంలోని ఆశ్రం ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ డిక్కీలో బంగారం, రూ.4 లక్షలు కొట్టేశారు

భీమడోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండుగొలను గ్రామంలో స్కూటర్ డిక్కీలో ఉంచిన సుమారు 8 కాసుల బంగారం, రూ.4 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పాత సినిమా హాలు సమీపంలో ఉంటున్న పెనుగంటి బుజ్జి బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన 8 కాసుల బంగారం విడిపించాడు. రూ.4 లక్షలు నగదు విత్ డ్రా చేసి స్కూటీ డిక్కీలో ఉంచాడు. మార్గమధ్యంలో కర్రీ పాయింట్ వద్ద ఆగి పార్సిల్ కట్టించుకుని ఇంటికి వెళ్లే నేపథ్యంలో డిక్కీ తెరచి చూడగా బంగారం, నగదు మాయమైనట్లు గుర్తించాడు. అయితే స్కూటీ డిక్కీకి తాళం లేకపోవడంతో ఈ చోరీ జరిగినట్లు బాధితుడు తెలిపారు. దీనిపై భీమడోలు పోలీసులను ఆశ్రయించగా సీఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు. మాయమైన నగదు, బంగారం ఎంత అనేది ఇంకా పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించలేదు.

కుమారుడికి కన్నీటి వీడ్కోలు

కొడుకు చివరి కోరిక తీర్చిన తల్లి



అరుణ్ కుమార్ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కుమారుడికి జన్మనిచ్చిన తల్లి కన్నీటితో అంతిమ వీడ్కోలు పలికింది. తాడేపల్లిగూడెం మండలం పడాలలో హృదయ విదారక ఘటన బుధవారం చోటుచేసుకుంది. అనారోగ్యం పాలైన కొడుకు తన అంతిమ సంస్కారాలు తల్లే చేయాలని కోరుకోవడంతో కొడుకు మృతదేహాన్ని ఖననం చేసి తుది వీడ్కోలు పలికి చివరి కోరిక తీర్చింది. పడాలకు చెందిన గుజ్జు అరుణ్ కుమార్ (35) రెండేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. తండ్రి పదేళ్ల క్రితం మరణించడంతో తల్లి జయంతి అన్నీ తానై ప్రేమగా పెంచారు. తన చివరి సంస్కారాలు తల్లే చూడాలని కోరడంతో కొడుకు మృతదేహం వెంట వెళ్లి సంస్కారాలు దగ్గరుండి చేశారు. ఈ దృశ్యాలు స్థానికులను కలిచివేశాయి.

గంజాయి తరలిస్తూ పాలకొల్లు వాసి అరెస్టు

పాలకొల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా హనుమాన్ సర్కిల్ వద్ద మంగళవారం ఎక్సైజ్ పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 4కిలోల గంజాయి, రవాణాకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మోహన్ సుందర్ పాలకొల్లు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, ఆయన గుత్తి మండలంలో పూజారిగా పనిచేస్తున్నట్టు గుర్తించారు.